ఆమె బొమ్మ.

పుత్తడి బొమ్మ.

స్వప్న సుషుప్తిలో అత్తవారింట అడుగు పెట్టింది.

భర్త సన్నిధిలో ఆర్నెల్ల జీవితం ఆడంబరంగా సాగిపోయింది. కష్టాలు తెలియలేదు. నష్టాలు జరగలేదు. ఆ తర్వాతే తెలిశాయి కష్టాలు, అరిష్టాలూ! కార్చిచ్చులూ కార్పణ్యాలు!

సంవత్సరం తర్వాత అవి ఒంటిమీద బొబ్బలుగా తేలాయి! ఈసడింపులూ, నిరసనలూ!! గుండెలో రగులుతున్న మంటలు కడుపులో పెరుగుతున్న పసికందును దహించి వేస్తున్నాయి. నిప్పహాయురాలై పోయింది!

పెళ్ళికాకముందు ఎన్నో వార్తల్ని చదివింది - కట్నపిశాచి కోరల్లో చిక్కుకుని చితికిపోయిన అబలల గురించి! ఐనా కోరిన కట్నమిచ్చి పెళ్ళి చేసుకుంది. అందరి జీవితాలూ అలాగే తెల్లవారుతాయని ఆమె నమ్మలేదు. తన జీవితం రంగులమయం చేసుకోవాలని ఆశించింది. ఫలితం శూన్యం!




భర్త నిరాదరణ! అత్తమామల సాముహిక హింస! ఇంకా కట్నం తెమ్మని పుట్టింటికి తరిమికొడుతున్నారు.

చితికిపోయిన తండ్రి జీవితం! వాయిదాపడ్డ చెల్లెలి పెళ్ళి! కుంటుపడ్డ తమ్ముడి చదువు!! గుండెల్ని పిండుతున్న పసివాడి ఆకలి...

సహనం అసహనంగా మారుతోంది! ఓర్పు ఓదార్పు నివ్వడం లేదు! జీవితం వెలుగులోంచి చీకటికి, బైటినుంచి బావిలోనికి...

చిరిగిన స్వప్నపు తెరలు, బితుకు బితుకుమంటున్న బీటలు వారిన బతుకు గోడలు ఆమె గుండెను రాయి చేశాయి!

ఆమెలో పిరికితనం పారిపోయింది! చావుకు తావివ్వలేదు! ప్రతిఘటించింది! ప్రళయకాళిలా ప్రభంజనం చేసింది! ఫలితంగా-

దుష్ట రాక్షస సంహారం జరిగింది!

అది తెగింపు! అది ముగింపు!!

జనం ముక్కు మీద వేలేసుకోలేదు, గుండెల మీద వెయ్యేసుకున్నారు! ఇప్పుడు భర్తలు తమ భార్యల వైపు భయంగా మాస్తున్నారు.

అది నవ శకానికి నాంది!*

— మణిగోపాల్

## కూలీ

ఆరోజు మా అక్క, బావగారు వస్తున్నారని స్టేషన్‌కు వెళ్ళాను. మా బావగారికి ముక్కు మీద కోపం, రూల్సు (అన్ని రకాలయినవి) కంఠోపాఠం. ఆయన వస్తున్నారంటేనే మా ఇంట్లో అందరికీ కొంచెం టెన్షన్.

ట్రెయిను వచ్చింది. అక్క బావగారు వచ్చారు. బావగారు ప్లాట్‌ఫారంపై కాలు పెట్టగానే భూకంపం వచ్చినట్టయింది. వాళ్ళు చాలా పెట్టెలు, బుట్టలతో దిగారు. నేను ఒక కూలి వాడిని పిలిచాను. కొంచెం ముసలివాడు.

"ఈ సామానుకి ఎంత తీసుకుంటావయ్యా?" ఆయన అడిగారు.

"ఇద్దరు మనుషులు మొయ్యాలయ్యా. చెరో పది ఇప్పించండి"

అంతే! బావగారు ఉగ్రరూపం దాల్చారు. ఆ సామానంతా కలిపి బరువెంతో హెడ్‌లోడ్ అంటే ఎంతో హెడ్‌లోడ్‌కి ఎంతివ్వాలో అంతకన్నా ఎన్ని కిలోల బరువు ఎక్కువ వుంటే ఎంతివ్వాలో దాని ప్రకారం ఆయన సామానుకి ఎంత కూలి ఇవ్వాల్సి వస్తుందో ఏకరువు పెట్టారు. అంతటితో ఆగక రైల్వే వారి నిబంధనల నుల్లంఘించి కూలి కోరినందుకు అతడి మీద కంప్లైంటు వ్రాస్తానని, అధికారులు అతనిపై తగు చర్య తీసుకునేట్టు చేస్తానని ఘంటా పథంగా చెప్పారు. అతని పేరు, నంబరు నోట్ చేసుకున్నారు.

ఆయన ఉపన్యాసం విని నాకు నోరెండి పోయింది. అంచెలంచెలుగా బావగారి ఆజ్ఞ ప్రకారం మేమే సామానంతా బయట చేరవేశాం. ఆటోవాడు మీటరు చార్జికే వస్తాననడంతో అక్కడొక యుద్ధం తప్పిందను కున్నాను నేను.

నాకెందుకో కూలి వాడిపై ఆయన దాడి నచ్చలేదు. అవి నేను జమ్ములో ఉద్యోగం చేస్తున్న రోజులు. మొట్ట మొదటిసారి నేను జమ్ము చేరినప్పుడు ఒక పెట్టె, ఒక బ్యాగుతో దిగాను. బ్యాగు వంకన తగిలించుకొని పెట్టె చేత్తో పట్టుకొని నడవసాగాను.

'సాబ్ కూలీ చాహియే' వెనక్కి తిరిగి చూశాను. దాదాపు అరవయ్యేవ పడిలో వున్న కూలీ సన్నగా, పొడుగ్గా వున్నాడు.

'సాబ్, సుబహ్‌సే కోయీ కమాయి నహీహై' ప్రొద్దుట నుండి ఏ మాత్రం ఆదాయం లేదు అనగానే యాంత్రికంగా నా సామాను అతనిచేతికందించాను.


జమ్ములో మొదటి ప్లాట్ ఫారం నుండి బయటకు వెళ్ళడం కూడా ఎంతో సులువు. సామాను ఆటోలో పెట్టగానే పది రూపాయిలు నోటు అతని చేతిలో పెట్టాను. చిల్లర లేదన్నాడు. నేను నవ్వి ఆటో వాడిని బయలుదేరమన్నాను. 'సాబ్ ...' అని ఏదో అంటున్నాడతను.

ఒక నెల రోజుల తర్వాత నేను డ్యూటీపై ఢిల్లీ వెళ్ళాల్సొచ్చింది. స్టేషన్‌కు చేరేసరికి ఎదురుగా ఆ కూలీ కనబడ్డాడు. 'సలాం సాబ్'

మరేం మాట్లాడకుండా నా సామానంతా తీసుకుని ఏ ట్రైను కెళ్ళాలని అడిగాడు. చెప్పాను. ట్రైనులో సామాను పెట్టాక పది రూపాయిల నోటు తీసి ఇచ్చాను. పుచ్చుకోడానికి నానా గొడవ చేశాడు. క్రితంసారి ఎక్కువ ఇచ్చావన్నాడు. ఈసారి మళ్ళీ కూలి తీసుకోవడం అన్యాయం అన్నాడు. నేను ఎంతో నచ్చజెప్పి బలవంతం చేస్తే తప్ప అతను డబ్బు తీసుకోలేదు. ట్రైను కదిలేంత వరకు అక్కడే వున్నాడు. నేను ఫలాన రోజు ఫలాన ట్రైనులో వస్తున్నానని నా కోసం ఎదురు చూడమని చెప్పాను.

అలాగే నా కోసం సిద్ధంగా వున్నాడు. అంతే మా ఇద్దరి మధ్యా అదో రకమైన అనుబంధం ఏర్పడింది. నేను అక్కడ వున్న మూడేళ్ళు స్టేషనులో మరో కూలి వాడికి నా సామాను ఇవ్వలేదు. ఒకవేళ అతను కనబడకపోతే నా మనసు కలతగా వుండేది. ఎప్పుడూ పది రూపాయిల కన్నా తక్కువ ఇచ్చేవాడిని కాదు. ఎప్పుడూ అతను డబ్బు తీసుకుందుకు నానా గొడవ చేసేవాడు.

ఒకసారి సామానంతా పెట్టేశాక ఇరవై రూపాయిలు



తీశాను ఇవ్వడానికి. చేతులెత్తి దండం పెట్టాడు. 'సాబ్ ఆప్ నే బహుత్ పైసే దేదియా. అబ్ మై నహీ లే సక్తాహు' (మీరు చాలా డబ్బిచ్చారు. ఇంక నేను తీసుకోలేను)

నేను జమ్ము నుండి బదిలీ అయి వెళ్ళిపోతున్నానని అందుకే అది కూలిగా కాక ఒక కానుకగా తీసుకోమన్నాను. అతని కళ్ళలో నీళ్ళు. నా కాళ్ళపై పడి పోయాడు. నేను లేవదీశాను. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నా వాళ్ళెవరూ లేని చోట నా వాడయ్యాడు. అతడు కూలి వాడని నాకెప్పుడూ అనిపించలేదు. సాటి మనిషిగా ట్రీట్ చేశాను. ఎప్పుడు స్టేషన్‌లో కూలి వాడిని చూసినా అతడే గుర్తొస్తుంటాడు. అతడొక్కడి ప్రవర్తన వల్ల నాకు కూలి వాళ్ళందరి మీద ఒక సద్భావం ఏర్పడింది.

'ఏ లోకంలో వున్నావోయ్ శంకరం?' దిగు! అన్న బావగారి గర్జనకు ఈ లోకంలో పడ్డాను. యాంత్రికంగా ఇంట్లోకి నడిచాను.

- కె. శ్రీరంచేటి